
# మానవుని మూల్యం



## ముమ్మనేని నాగేశ్వరరావు

వీధుల్లో పెంటపోగుల్లోని ఎంగిలి విస్తళ్లు వెతుక్కుంటూ కుక్కలతో పాటు అతనూ దొరికిన రొట్టెముక్కలు పోగుచేసుకొంటూ సైడుకాలువ పక్కన కూర్చొని అమృత తుల్యంగా తింటూండే వాడు. అతను గుడ్డివాడు, మందభాగ్యుడు. జారిపోతున్న యౌవనం. వెడల్పాటిరొమ్ముల్లోనూ, కండలు తిరిగి శుష్కించిపోతున్న చేతుల్లోనూ అతని పూర్వౌన్నత్యాన్ని చిత్రిస్తోంది. అతనికి వుండడానికి ఇల్లు, తనువు కప్పుకోవడానికి పీలికపోగులు అయినాలేవు. అతను రోడ్డుచివర కూర్చుని తరచుగా అరుస్తుండేవాడు – 'అన్నదాతలారా! కొంచెం మంచినీళ్లు తాగించండ'ని కాని నేటి సభ్యమానవుల దగ్గర ఇంత తీరిక వుందా అందరి మాటలూ వింటూండడానికి?

నిత్యమూ నేను కాలేజికి వెళ్లుతూ అతన్ని త్రోవలో చూస్తూండేవాడిని. చాలాసార్లు మనస్సులో అనుకున్నాను. జాలివేసి 'కొంచెం నీళ్లు తాగిద్దామా' అని. పాపం ఎంత దప్పికతో వున్నాడో! కాని స్నేహితులు చూస్తేనో? వాళ్లు నన్ను గురించి ఏమనుకుంటారు? ఎగతాళి చెయ్యరూ? దోవనుపోయేవాళ్లందరూ అతని నీడనుగూడ స్పృజించకుండా దూరంగా తొలిగిపోతుండగా చూస్తుండేవాడిని. పొరుగున ఎప్పుడు దొంగతనం జరిగినా ముందుగా యితనినే లోకులు అనుమానించేవారు. ఎప్పుడైనా దొంగలు పట్టుబడకపోతే పాపం – యితన్నే జైల్లో తోసేవారు.

* * *

ఓ రోజున అతను ఎవరితోనో చెప్పుతుండగా విన్నాను – అసలతను పుట్టు గ్రుడ్డికాదట. అతను పడుచుదనంలో వుండగా యీ పట్నంలోనే ఒక మిల్లులో పని చేస్తూండేవాడట. పగలు – రాత్రి విద్యుత్ బల్బుల కాంతిలో నించొని పనిచేస్తున్నందువల్ల కండ్లకు జబ్బు వచ్చింది. ఇదే కారణంగా మిల్లు పనిలోంచి వెళ్లగొట్టబడ్డాడు. తరవాత ఎంత ప్రయత్నించినా ఎచ్చటా పనిదొరకలేదు. రాను రాను కడుపుమంటతో బాటు కళ్లు గూడ యీ పాడు ప్రపంచాన్ని చూడమని ప్రతిజ్ఞ చేసి విశ్రమించినయ్.

పాపం ఇప్పుడతను దోవపక్కని కూర్చొని బిచ్చం అడుక్కుంటూ వున్నాడు. ఉదయం మొదలు సాయంత్రం వరకూ దాతలందరినీ దీవించి, దేవుడందరికీ మేలు చేయాలని ప్రార్థిస్తూ వున్నప్పటికీ ఏ అన్నదాతయినా కనికరించి అతని చేతిలో ఒక కానీ పెట్టినట్టు కనిపించదు. దానం

పొందడానికి పాపం అతని దగ్గర ఏమైనా ఆకర్షణ వుంటేగాదూ!

* * *

... ఈ విధంగా అతని జీవితం నడిచిపో తోంది. మానవుడు విపత్తుల్ని సహిస్తూ దానికి అనుకూలంగా జీవించడానికి అలవాటు పడు తూ వుంటాడు.

క్రిస్మసు సెలవులకు నా ఆర్టిస్టు మిత్రుడు కలకత్తానించి మా ఇంటికి వచ్చాడు. ఆ రోజునే అతను ప్రస్తావించిన మీదట మధ్యాహ్నంపూట పట్నం చూడ్డానికి బయల్దేరాం.

మిట్టమధ్యాహ్నపు ఎండలో తిరుగుతూ పొట్టపూజ చేసుకోవడానికి మేము ఒక హెూట లు వైపుకు నడిచాం. ద్వారం దగ్గర వెళ్లి చూస్తిని గదా "వీధుల సామ్రాట్టు" ఆ గుడ్డి బిచ్చగాడు పెంటపోగు దగ్గర కూర్చుని ఏమో వెతుకు తున్నాడు, తనకన్నా ఆత్రంతో పొట్టకక్కుర్తికి పరుగెత్తి వస్తున్న కుక్కల్ని కర్రతో అదిలిస్తూ. నా నేత్రాలు యీ ఘృణీత దృశ్యాన్ని చూడ్డం యిష్టపడక హెూటల్లో పేర్చివుంచిన ఫలహార సామాగ్రుల్ని చవిచూడ్డంలో లీనమైంది. ఏమో గాని, ఇందులో ఏమి చిత్తాకర్షణ కనిపించిందో నా మిత్రుడు పదినిముషాల వరకూ అతనివంక చూస్తూ నించున్నాడు – ఆ దృశ్యాన్ని తన మెద డులో భద్రపరచుకుంటున్నట్టు...

ఇంటికి వచ్చిన తరవాత నా మిత్రుడు ఆ బిచ్చగాడిని గురించి ఏమేమో చెప్పుకొంటూ



విశాఖపట్నం పౌర గ్రంథాలయంలో ప్రముఖ రచయిత యం. రామకోటి రచనలపై సాహిత్య సమాలోచన కార్యక్రమం సందర్భంగా సాహితీవేత్తలు శ్రీయుతులు సి.ఎస్. రావు, వరాహాలశెట్టి – రచయిత రామకోటిని సన్మానిస్తున్న దృశ్యం. ప్రముఖ కవి గరిమెళ్ల నాగేశ్వరరావు కూడా చిత్రంలో ఉన్నారు.

వచ్చాడు. ఆ దృశ్యం నేటి ప్రగతిశీల కళాకృతుల్లో ప్రథమస్థానం పొందుతుందంటూ తనేదో భావావేశంలోకి వచ్చినట్టు మాటిమాటికీ చెప్పాడు. వెళ్లబోతూ తప్పక యీ దృశ్యాన్ని చిత్రించి అఖిలభారత ప్రదర్శనంలోకి ఈయేడే పంపిస్తానని చెప్పి వెళ్లిపోయాడు.

ఆ దృశ్యాన్ని చూచినప్పటినించీ అతనిలో ఏమి కళాశక్తులు పొంగినవో నాకు తెలియలేదు. సంవత్సరాల పర్యంతం చూస్తూ వస్తున్న నాలో ఎందుకూ కొరగాని జాలిమాత్రం పుడుతుండేది. కాలక్రమేణ యీ విషయమే నేను మరచిపోయాను.

* * *

వసంతఋతువు ఆరంభం కావడంతోనే మా కాలేజీపార్టీ అర్థశాస్త్రం స్టడీ చెయ్యడానికి వివిధ నగరాల పర్యటన చేద్దామని నిశ్చయించింది. ఆ ప్రకారం కన్సెషన్ టికెట్లు తీసుకొని అందరమూ బయలుదేరాం.

సభ్య కేంద్రాలనిపించుకునే వివిధ నగరాలు చూచిన తర్వాత బొంబాయి పట్నం చేరుకున్నాం. అచ్చట ఆ యేడు అఖిలభారత ప్రదర్శనం జరుగుతున్నది.

మిత్రమండలి ముస్తాబై ప్రదర్శనం చూడ్డానికి బయలుదేరింది. వినోద వస్తువులన్నీ చూచిన తర్వాత చిత్ర ప్రదర్శన చూడ్డానికి బయల్దేరాం. ద్వారంలో అడుగుపెట్టేటప్పటికి ఎప్పటినుంచో విస్మృతిలో పడివున్న సంగతి నాకు జ్ఞాపకం వచ్చింది. నా మిత్రుడు ఈ ప్రదర్శనానికి తన చిత్రాన్ని పంపిస్తానన్నాడు. కుతూహలంతో నలువైపులా దృష్టి ప్రసారించాను. దూరాన ఒక చిత్రం క్రింద పెద్ద అక్షరాల్లో వ్రాయబడివుంది. "ఈ సంవత్సరం ప్రథమ పారితోషికం ఈ చిత్రానికి ఇవ్వబడింది" అని.

> నువ్వు ప్రజలను అంచనావేయడం ప్రారంభిస్తే ఇక నీకు ఎప్పటికీ వారిని ప్రేమించడానికి సమయం దొరకదు.
>
> నిన్ను నీవు మెరుగుపరచుకోవడానికి ఎక్కువ సమయం వెచ్చించు. అప్పుడు ఇతరులను విమర్శించడానికి సమయమే ఉండదు.

నాలో ఎక్కడలేని ఉత్కంఠ పొంగి వచ్చింది చిత్రం చూద్దామని. కాళ్లు తమంతటతామే ముందుకు నడిచాయి. గడిచిన స్మృతులు తెర మీదికి ఒకటొకటిగా వస్తున్నాయి. వేలమైళ్ల దూరాన వున్న మా పట్నపు దృశ్యం కళ్లకు కట్టినట్టు స్మృతికి వచ్చింది.

ఆ అంధబిచ్చగాడు! ఎంగిలి విస్తళ్లు!! దగ్గరకు వెళ్లి చూస్తిని గదా – నా వుద్దేశం నిజమయ్యింది. ఇది నా మిత్రుడు చిత్రించినదే. అంధబిచ్చగాడు అత్యంత దైన్యభావంగల ఆత్రంతో చేతికర్రను పక్కను వదిలి ఎంగిలి విస్తళ్లనుంచి రొట్టెముక్కలు ఏరుకుంటున్నాడు. నాలుగైదు కుక్కలు తమ అధికారాన్ని హరిస్తున్న మానవుని వంక నాలుకలు వేళ్లాడవేసి జాలిగా చూస్తున్నయ్.

చిత్రం గీసినందుకు నా మిత్రుడికి ప్రథమ పారితోషికం దొరికింది. కళా ప్రపంచంలోకి వచ్చేప్పటికి ఆ అంధుడి జీవితానికి ఇంత మూల్యం కాబోలు!!!

చిత్రం క్రింద బంగారు అక్షరాలతో వ్రాసి వుంది. "అసమ సౌందర్యం!" అని.

ఇది చదివేప్పటికి నేను ఆలోచనలోపడి ఏమీ నిర్ణయించుకోలేకపోయాను. ఏది సౌందర్యం? ఈ చిత్రమా లేక అంధ బిచ్చగాని జీవితమా? ●